ఉసురు తీస్తున్న ఒత్తిడి

- పాఠశాల స్థాయి నుంచే డిప్రెషన్
- ర్యాంకు సాధించలేమోనని కలత
- తల్లిదండ్రులకు భయపడి బలవన్మరణాలు
- యువతులలో ఆరోగ్య సమస్యలు
- కౌన్సెలింగ్‌తో మేలు 9

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





అజ్జరం లేఅవుట్‌లో ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

తణుకు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ జరిగే స్థలాలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు. శనివారం కూటమి నాయకులతో కలసి పట్టణంలోని అజ్జరం లేఅవుట్, తేతలి, దువ్వ లేఅవుట్ ప్రాంతాలను పరిశీలించారు. వీటిలో ఎక్కడ స్థలం అనువుగా ఉంటుందనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

పర్యటన ఏర్పాట్లు చేయాలి: జేసీ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫిబ్రవరి1న తణుకు పర్యటనకు సంబంధించిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్ఎస్‌వీటీ కళాశాల ప్రాంగణంలోని హెలీపాడ్ ప్రాంగణంతో పాటు ప్రత్యామ్నాయంగా తేతలి జాతీయ రహదారి పక్కన మరో హెలీ ప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. పర్యటనకు చేయాల్సిన పనులకు సంబంధించి ఆయా శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజబాబు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్ టి.పద్మనాభం, అడిషినల్ ఎస్పీ వి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

మిరియాలకు పద్మశ్రీ



- కళకు ప్రాణం పెట్టిన అప్పారావు
- 5వేలకు పైగా బుర్రకథల స్టేజీ ప్రోగ్రాంలు
- అనారోగ్యంతో ఈనెల 15న రావులపాలెంలో మృతి
- అప్పారావుకు కళల విభాగంలో పద్మశ్రీ ప్రకటించిన కేంద్రం

రావులపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సినిమాలు, టీవీలు ప్రాచుర్యం లేని రోజుల్లో బుర్రకథకు మంచి క్రేజ్ ఉండేది. జాతర్లలో కళాకారులు స్టేజీపై బుర్రకథ చెబుతుంటే ప్రేక్షకులు ఈలలు, కేరింతలు, తప్పట్లతో కళాకారులను ప్రోత్సహిస్తుంటే, ఆ కథలు తెల్లవారే దాకా అలుపెరగకుండా కళాకారులు కళకు ప్రాణం పెట్టి బుర్రకథను చెప్పేవారు. కళకు ప్రాణం పెట్టి ఆ కళలో నవరసాలు పండించడంలో మిరియాల అప్పారావుకు సాటిలేరు అంటే అది అక్షరసత్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ముఖ్యంగా కోనసీమతో అనుబంధం ఉన్న మిరియాల అప్పారావు 1949లో కరప మండలం నడకుదురు గ్రామంలో మిరియాల వెంకట రామయ్య- తిరుపతమ్మలకు జన్మించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 1969లో బుర్రకథ రంగంలో అడుగుపెట్టి డ్రాయింగ్ మాస్టర్, జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం గురువుల వద్ద శిష్యరికం చేసి ప్రధాన కథకునిగా ప్రావీణ్యం పొందారు. అనంతరం అక్కడ మొదలుపెట్టిన ప్రస్థానం వెనుతిరిగి చూడకుండా ఎన్నో స్టేజీ ప్రోగ్రాంలు చేశారు. 1974లో ఆల్ఇండియా రేడియోలో, 1993లో దూరదర్శన్‌లో ప్రోగ్రాంలు ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించిన బుర్రకథ పోటీలో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండి కప్‌ను ముప్పన రామారావు చేతుల మీదుగా అందుకున్నారు. 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ చెప్పిన ఘనుడు ఈయన. 50 ఏళ్ల బుర్రకథ ప్రస్థానంలో అలుపెరగకుండా ఎన్నో స్టేజీ ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల మన్ననలను పొందారు. ప్రస్తుతం బుర్రకథ చెప్పేవారిలో 70 శాతం మంది కళాకారులు ఈయన శిష్యులే. ఈయనకు గానగంధర్వ, గాన కోకిల, బుర్రకథ టైగర్, బుర్రకథ మాస్టర్, బుర్రకథ పితామహుడు, వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ తదితర అవార్డులను, బిరుదులను పొందారు. ఈయన 5 వేలకుపైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు ప్రదర్శించారు. మిరియాల అప్పారావుకు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. వారిలో రావులపాలెంలో ఉంటున్న బ్రహ్మాజీ, సుబ్బరాజు, బాబా అనే కుమారులు, వీరనాల లలిత (రావులపాలెం) యడవల్లి శ్రీదేవి (తాడేపల్లిగూడెం) అనే ఇద్దరు కుమార్తెలు కూడా బుర్రకథ కళారంగంలోనే కొనసాగుతుండడం విశేషం. ఎన్నో స్టేజీ ప్రోగ్రామ్‌లు అందించి ఎందరో ప్రేక్షకుల మన్నలను పొంది కళారంగానికి వన్నెతెచ్చిన మిరియాల అప్పారావు ఈనెల 15వ తేదీన అనారోగ్యంతో రావులపాలెంలోని ఆయన కుమారుడు బ్రహ్మాజీ ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. కళారంగంలో ప్రావీణ్యం చెందిన అప్పారావు (76) మృతితో కుటుంబ సభ్యులు, ఆయన శిష్యబృందం విచాకరంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుతో ఆనందం వ్యక్తం చేశారు.



కొల్లేరు ప్రజలకు.. అండగా ఉంటాం!

కైకలూరులో కొల్లేరు ప్రజల ఐక్యవేదిక బహిరంగ సభ

- ప్రజల పక్షాన సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తాం
- పర్యావరణంతో పాటు ప్రజలు అవసరమే
- జిరాయితీ, సొసైటీ భూములను ఇప్పించేందుకు కృషి
- కొల్లేరు ప్రజలకు ప్రజా ప్రతినిధుల భరోసా
- భారీగా తరలివచ్చిన కొల్లేరు ప్రజలు

కైకలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు ప్రజల జీవనోపాధిని కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులో శనివారం కొల్లేరు ప్రజల ఐక్యత బహిరంగ సభను నిర్వహించారు. సభలో కొల్లేరు ప్రజల సంక్షేమానికి ఐక్యతతోనే పోరాటం చేసి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేయాలని తీర్మానం చేశారు. సభకు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కొల్లేరు గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజల పరిరక్షణకు కృషి

పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, ఎంపీ



కొల్లేరు ప్రజల పరిరక్షణకు కృషి చేస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పోరాడతాం. ఒక్క చెరువు కూడా కొట్టకుండా పోరాటం చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. చెరువులను ధ్వంసం చేయకుండా ఇప్పటికే నిలుపుదల చేశాం. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి ఢిల్లీలో పోరాటం చేస్తా.

కొల్లేరు ప్రజల సమస్య తీరుస్తాం..

కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎమ్మెల్యే



కొల్లేరు ప్రజల సమస్య తీర్చేలా కృషి చేస్తా. ఇకపై కొల్లేరు ప్రజలు ఎవరిపైనా ఆధారపడకుండా స్వేచ్ఛగా జీవించేలా శాశ్వత పరిష్కారానికి ఐక్యతతో పోరాటం చేద్దాం. సుప్రీంకోర్టులో కొల్లేరు ప్రజల తరఫున వాదనలు వినిపించేందుకు ఎంపీ మహేశ్‌తో పాటు, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు న్యాయపోరాటం చేస్తారు. పర్యావరణం, పక్షులతో పాటు ప్రజల జీవించాల్సిన అవసర ముంది. అందుకోసం గతంలో ప్రతిపాదించిన 14 వేల ఎకరాల జిరాయితీలు, ఏడు వేల ఎకరాల సొసైటీల భూములు కాంటూరు నుంచి బయటకు తీసుకొచ్చి ప్రజలకు అందించాలి. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ టూరిజం అభివృద్ధి చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. కొల్లేరు డ్రెయిన్లతో పాటు ఉప్పుటేరు ఆక్రమణలను తొలగిస్తాం.

ఆందోళన చెందవద్దు..

చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే



కొల్లేరు చెరువుల ధ్వంసంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇక్కడ ప్రజలు జీవన పరిస్థితులను సుప్రీం కోర్టు దృష్టికి తీసుకువెళ్లి ప్రజలను రక్షించుకునే పనిచేస్తాం. రైతులు ముసుగులో కొల్లేరులో బయట వ్యక్తులు చేపల సాగు చేస్తున్నారని కొంతమంది అపవాదులు సృష్టి స్తున్నారు. వీటిని తిప్పికొట్టేందుకు కోర్టులో వాదనలు వినిపించాల్సిన అవసరముంది. ఒకసారి కాంటూరు కుదింపు చేసి సరిహద్దులు నిర్ధారణ చేస్తే దానికి లోబడి సుప్రీంకోర్టు పరిధిలోకి తీసుకుంటుంది. ఆ దిశగా ప్రయత్నం చేస్తాం.

కాంటూరును కుదించాలి..

పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే



కొల్లేరు కాంటూరును 77, 138 ఎకరాల నుంచి 50 వేల ఎకరాలకు కుదింపు చేయాలి. గతంలోని జిరాయితీ భూములను, సొసైటీ భూములను ప్రజలకు అందిస్తే ప్రజలు జీవిం చేందుకు ఎంతో ఉపయోగపడతాయి. గత ప్రభుత్వ హయాంలో కొల్లేరు ప్రజల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం చెరువులను ధ్వంసం చేయకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిలుపుదల చేసేలా నాయకులంతా ఐక్యతతో సాధించుకోవాల్సి ఉంది.

చేపలను పెంచుకునే హక్కు లేదా..?

జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్సీ



కొల్లేరులో పర్యావరణం పేరుతో ఎవరు కేసులు వేసినా వెంటనే చెరువులను ధ్వంసం చేస్తామంటున్నారు. అరకు అటవీ శాఖ ప్రాంతంలో ఉన్నప్పటికీ కాఫీ పంటను పండించుకునే హక్కు ఉన్నప్పుడు కొల్లేరులో ధ్వంసం చేసిన చెరువుల్లో చేపలు పెంచుకునే హక్కు లేదా..? అని ప్రశ్నించారు. మార్చి 31వ తేదీ నాటికి చెరువులను ధ్వంసం చేసే ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నం చేయాలి. భూములను ఆక్రమించుకోవడం లక్ష్యం కాదని ప్రజలు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా కాంటూరు కుదింపు చేయాలి. కొల్లేరు ప్రజలతో కలసి కాంటూరు కుదింపునకు కృషి చేస్తా. 15 వేల జిరాయితీ భూములను, కొల్లేరు ఆపరేషన్‌లో అక్రమంగా ధ్వంసం చేసిన 7500 ఎకరాలను ప్రజలకు ఇప్పించేవరకు పోరాటం చేస్తా.

ఎకో సెన్సిటివ్‌జోన్ నుంచి కాపాడాలి..

వీరాంజనేయులు, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు



కొల్లేరు కాంటూరు కుదింపుతో పాటు ఎకో సెన్సిటివ్‌జోన్ నుంచి కాపాడుకోకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులకు గురవుతాం. వీటిని సాధించుకునేందుకు అందరితో కలసికట్టుగా నేను పోరాటం చేస్తా. కాంటూరు కుదింపు సమస్య తీరకుండానే ఎకో సెన్సిటివ్‌జోన్ పేరుతో పుండుపై కారం చల్లినట్లుగా వ్యవహరిస్తున్నారు. కలిసికట్టుగా పోరాడి సమస్యను పరిష్కరిద్దాం.

ఆ.. భూములను ఇప్పించండి



బలే ఏసురాజు టీడీపీ వడ్డీ సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్

గతంలో చేపలు సాగు చేసుకుని ప్రజలు జీవనోపాధిని పొందాలని అప్పటి ప్రభుత్వాలే చెరువులను తవ్వించాయి. పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రజల జీవనోపాధిని దెబ్బ తీస్తున్నారు. కొల్లేరు ఆపరేషన్ చేసి 20 ఏళ్లు అవుతున్నా ప్రజలకు ఏ విధమైన న్యాయం చేశారన్నది కోర్టులు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కొల్లేరు ఆపరేషన్‌లో 7,500 ఎకరాల భూములు అదనంగా ధ్వంసం చేశారు. వారికి నష్టపరిహారం నేటికీ అందలేదు. కొల్లేరు సరస్సు మొత్తంలో 53 సొసైటీలు ఉండగా వాటిలో 33 సొసైటీలు లంక గ్రామాల్లోనే ఉన్నాయి. ఆ సొసైటీ భూములతో పాటు అదనంగా ధ్వంసం చేసిన 7500 ఎకరాల భూములను ప్రజలకు తిరిగి ఇప్పించాలి. చెరువులను ధ్వంసం చేసే ప్రయత్నాలు చేసినా కొల్లేరును వదిలి వెళ్లే ప్రసక్తే లేదు.

పర్యావరణానికి వ్యతిరేకం కాదు...

సైదు సత్యనారాయణ, కొల్లేరు సంఘ అధ్యక్షుడు



పర్యావరణానికి, పక్షులకు కొల్లేరు ప్రజలు వ్యతిరేకం కాదు. వాటిని కాపాడుకుంటూనే 4లక్ష ల మంది ప్రజలకు జీవనోపాధి ని కల్పించాలి. పర్యావరణానికి అవసరమైన భూమిని ఉంచుకుని మిగిలినది ప్రజలకు అందిస్తే కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేసినట్లు అవుతుంది. మా భూములను మాకు ఇప్పించండి.

ఐక్యతతో వాదనలు వినిపించాలి...



ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన నాయకురాలు

పర్యావరణం కోసం ఇతరులు కేసులు వేసినప్పటికీ దాని కౌంటర్ పిటీషన్‌లు కోర్టులో వేయలేకపోతున్నాం. ప్రజలంతా ఐక్యతతో ఉండి సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తేనే సమస్యకు పరిష్కారమవుతుంది. లేకుంటే నిత్యం ప్రజలు భయపడుతూనే జీవనం సాగించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది

కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం



నంబూరి వెంకటరామరాజు, చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కొల్లేరు సమస్యకు చట్టపరమైన ఇబ్బందులు లేకుండా తొలగించేందుకు కృషి చేయాలి. అందుకు అవసరమైతే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. ప్రజలకు జీవనోపాధిని కల్పించేందుకు రాష్ట్ర చేపల రైతుల సంఘం అండగా ఉంటుంది. కోర్టుల్లో వాదనలు వినిపించే అంశంలో మేము పోరాడతాం.

సభకు హాజరైన కొల్లేరు గ్రామాల ప్రజలు



టీడీపీ సభ్యత్వాల్లో పాలకొల్లు టాప్

- రికార్డు స్థాయిలో నమోదు
- జిల్లాలో 30శాతం మంది తెలుగుదేశం సభ్యులే
- పాలకొల్లు, ఉండిలో రికార్డులు బ్రేక్



సభ్యత్వ నమోదు ఇలా


పాలకొల్లు	-1,49,458
ఉండి	- 1,21,552
తణుకు	- 62,618
ఆచంట	- 44610
భీమవరం	- 41208
తాడేపల్లిగూడెం	- 38018
నరసాపురం	-32718

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో జరిగింది. జిల్లాలో ఉన్న ఓటర్లలో నాలుగో వంతుమంది తెలుగుదేశం సభ్యులుగా చేరారు. జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పాలకొల్లు ప్రథమ స్థానంలో నిలచింది. రాష్ట్ర స్థాయి రికార్డులను బ్రేక్ చేసేలా సభ్యత్వాలు నమోదయ్యాయి. ఆ తర్వాత స్థానంలో ఉండి నియోకవర్గం నిలిచింది. ఓటర్లలో దాదాపు మూడో వంతు మంది వంతుమంది తెలుగుదేశం సభ్యత్వం తీసుకున్నారు. నమోదు కార్యక్రమాన్ని పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గతంలో మాదిరిగా కేవలం రశీదులు ఇచ్చే సంప్రదాయానికి స్వస్తి చెప్పింది. సభ్యత్వం తీసుకున్న వారు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంది. దాంతో ఇష్టం ఉన్న వారే తెలుగుదేశం సభ్యత్వం తీసుకునే విధంగా పార్టీ ఆదేశాలు జారీచేసింది. నియోజకవర్గ బాధ్యులు అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి పనిచేశారు. ప్రణాళికాబద్ధంగా సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది సభ్యత్వాన్ని తీసుకుంటే ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే దాదాపు 4.90 లక్షల మంది తెలుగుదేశం ప్రాథమిక సభ్యత్వంలో చేరారు. తెలుగుదేశం పార్టీ బీమా సౌకర్యం కూడా కల్పించింది. అన్ని వర్గాలనుంచి స్పందన లభించింది. కేడర్ కూడా పట్టుదలతో సభ్యత్వనమోదుకు కృషి చేసింది. ప్రభుత్వం ఏర్పడినా సరే సరైన ప్రాతినిధ్యం లేకుండా పోయిందంటూ జిల్లాలోని కొన్ని నియోకవర్గాల్లో తెలుగుదేశం శ్రేణులు ఆందోళనతో ఉన్నాయి. ముఖ్యంగా తాడేపల్లిగూడెం, భీమవరం, నర్సాపురంలో ఈ సారి నాయకత్వంలోనూ, కేడర్‌లోనూ కాస్త అసంతృప్తి ఉంది. మూడు నియోకవర్గాల్లో కూటమిలో భాగంగా జనసేనకు కేటాయించారు. అయితే నామినేటె డ్ పదవుల విషయంలోనూ ప్రధాన్యం లభించలేదు. అయినా సరే సభ్యత్వ నమోదులో నియోజకవర్గ బాధ్యులు తమ వంతు కృషి చేశారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టారు. ఎప్పటికప్పుడు అధిష్ఠానం కూడా నియోజకవర్గాల వారీగా అప్రమత్తం చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేసింది.

మూడవ వంతు సభ్యత్వం

జిల్లాలో 14,70,852 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 4,90,182 మంది సభ్యత్వాన్ని తీసుకున్నారు. అంటే దాదాపు 33శాతం మంది ఓటర్లు తెలుగుదేశం సభ్యత్వాన్ని తీసుకున్నారు. పార్టీ చరిత్రలో ఇంతలా సభ్యత్వ నమోదు కావడంపై పార్టీ శ్రేణుల్లోనూ జోష్ నెలకొంది. పార్టీకి బలమైన నాయకత్వం, కేడర్ ఉండడంతో ఇది సాధ్యపడింది.



రికార్డుల బ్రేక్..

పాలకొల్లు నియోజకవర్గంలో ఈసారి సభ్యత్వ నమోదుకు పోటీ పడ్డారు. ఇక్కడ 1,94,913మంది ఓటర్లున్నారు. దాదాపు 75 శాతం మంది ఓటర్లు సభ్యత్వాన్ని తీసుకున్నారు. అంటే 1,49,458 మంది ఓటర్లు పాలకొల్లు నియోజకవర్గంలో సభ్యత్వం పొందారు. రాష్ట్ర స్థాయిలోనే పాలకొల్లు నియోజకవర్గం రికార్డులు బ్రేక్ చేసింది. మంత్రి నిమ్మల రామానాయుడు ప్రణాళిక అక్కడ బాగా పనిచేసింది. ఆ తర్వాత ఉండి నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వాలు తీసుకున్నారు. ఉండిలో 1,21,552మంది సభ్యత్వం పొందారు. అక్కడ 60 శాతం మంది ఓటర్లు తెలుగుదేశం సభ్యత్వం తీసుకున్న వారిలో ఉన్నారు. రెండు నియోజకవర్గాలు ఈసారి గట్టి పోటీ పడ్డాయి. తెలుగుదేశం పార్టీకి ప్రాతినిధ్యం లేని భీమవరం, తాడేపల్లిగూడెం, నర్సాపురం నియోకజవర్గాల్లోనూ మునుపెన్నడూ లేని విధంగా సభ్యత్వాలు నమోదు చేశారు. తణుకు, ఆచంట నియోకవర్గంలో ఈ సారి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లారు. మొత్తంపైన అధిష్ఠానం ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలో సభ్యత్వాలు నమోదు కావడంతో నాయకత్వం , కేడర్ మంచి జోష్ మీద ఉంది.

పెండింగ్ బీపీఎస్‌కు కదలిక

- మార్చి నెలాఖరు నాటికి పరిష్కరించాలని ఆదేశం
- దరఖాస్తుల పరిశీలనలో టౌన్‌ప్లానింగ్ అధికారులు



భీమవరం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో అనధికారికంగాను, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఏర్పాటు చేసిన బిల్డింగ్ పీనలైజేషన్(బీపీఎస్) పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈ ఏడాది మార్చి 31 లోగా పరిష్కరించాలని మునిసిపాలిటీలకు ఆదేశాలు అందాయి. ఈ పథకం 2019లో నుంచి దఫదఫాలుగా గడువును పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దరఖాస్తులు పరిష్కరించాలని అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యదర్శి కె.కన్నబాబు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. 2019 లో దరఖాస్తు చేసుకున్నవాటిలో పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు. మూడు నెలల కాలంలో పూర్తి చెయ్యాలన్నారు ఇటీవల రాష్ట్ర స్థాయిలో టౌన్‌ప్లానింగ్ అధికారులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని మరో ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలోని 4 మునిసిపాలిటీల్లో ఉన్న వాటి వివరాల ఆధారంగా ఉన్నతాధికారులు సమీక్ష చేశారు. భీమవరం మునిసిపాలిటీకి సంబంధించి 56 దరఖాస్తులు ఉండగా అందులో ఇప్పటికే 24 దరఖాస్తులను పరిష్కరించారు. 4 దరఖాస్తులను రిజక్ట్ చేశారు. ఆరు దరఖాస్తుదారులకు సొమ్ములు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. 21 దరఖాస్తులు షార్ట్‌ఫాల్‌లో ఉన్నాయి. అధికారులు అడిగిన సమాచారాన్ని యజమానులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఈ దరఖాస్తులు పరిష్కారం అవుతాయి. ఒక దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నరసాపురం మునిసిపాలిటీలో బీపీఎస్‌కు సంబంధించి దరఖాస్తులు ఏమి లేవని అన్ని పరిష్కారమైనట్లుగా అధికారులు తెలిపారు. తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. దాదాపు ఆరు నెలల తరువాత మళ్లీ బీపీఎస్‌పై ఆదేశాలు రావటంతో సంబంధిత దరఖాస్తులు టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి సంబంధిత యజమానులతో మాట్లాడుతున్నారు. సత్వరం పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు.

పాడి రైతుల అభివృద్ధికి సహకరిస్తాం: కలెక్టర్

ఆచంట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశు రైతులకు ప్రభుత్వం తరుపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం ఆచంటలో ఉచిత పశువైద్య శిబిరాన్ని కలెక్టర్ నాగరాణి తొలుత గోమాతకు పూజ చేసి ప్రారంభించారు. అనంతరం పశువుల పరీక్షల నిర్ధారణలో వినియోగించే లేబొరేటరీ పరికరాలను పరిశీలించారు. అందాల దూడల ఎగ్జిబిషన్‌ను తిలకించారు. సూడి ఆవుకు చేసిన సీమంతంలో పాల్గొన్నారు. జిల్లాలో 183 పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పశుగణన సర్వే ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్నారు. తాను కూడా చిన్నతనం నుంచి పాడి పంటలు మధ్య పెరిగానని ఆ నాటి మధుర జ్ఞాపకాలు ఎంతో ఆనందాన్ని ఇస్తాయని గుర్తు చేసుకున్నారు. జిల్లా పశువైద్య శాఖా అధికారి డాక్టర్ కె. మురళీకృష్ణ, ఆచంట వైద్యాధికారి డాక్టర్ ఫణి కుమార్, సర్పంచ్ కోట సరోజిని, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి పాల్గొన్నారు.



గోమాతకు పూజ చేస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి


అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

గంజాయి ఆనవాళ్ల కోసం గాలింపు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): గంజాయి ఆనవాళ్ల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తాడేపల్లిగూడెం నిట్ పరిసరాలతోపాటు మండలంలోని ఎల్. అగ్రహారంలోని టిడ్కో 77 ఇళ్ల సముదాయాలు, తోటల్లో పోలీసులు శుక్ర, శనివారాల్లో నిఘా పెట్టారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 23న వచ్చిన 'మత్తుతో జీవితం చిత్తు' శీర్షికన గంజాయిపై వచ్చిన కథనానికి స్పందనగా రూరల్ సీఐ రమేష్, ఎస్ఐ ప్రసాద్ గాలింపు చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో అనుమానితులను, కిళ్లీ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. ఎక్కడైనా గంజాయి ఉన్నట్టు తెలిస్తే కఠిన చర్య లు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీధర్..

రాష్ట్ర అవార్డుకు ఎంపిక

తణుకు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తణుకులోని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ శిక్షణా కేంద్రంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఆర్. శ్రీధర్ తాను రాష్ట్ర ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న విజయవాడలో జరిగే వేడుకలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.

ప్రజల ప్రాణాలు డ్రైవర్ల చేతిలో : ఆర్టీవో

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వాహనాలు జాగ్రత్తగా నడిపితే మీ ప్రాణాలతోపాటు ప్రజల ప్రాణాలు కాపాడవచ్చని తాడేపల్లిగూడెం ఆర్టీవో సురేంద్రసింగ్ నాయక్ కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా తాడేపల్లిగూడెం ఆర్టీవో కార్యాలయం వద్ద శనివారం పట్టణంలోని ట్యాక్సీ, ఆటో డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలు నడిపేటప్పుడు పాటించాల్సిన నియమాలు వివరించారు.

బాలలను ప్రోత్సహించాలి

తణుకు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బాలల్లో సృజనాత్మక శక్తి దాగి ఉందని, వారిని పోత్సహిస్తే అద్భుతంగా రాణిస్తారని బాలోత్సవం అధ్యక్ష, కార్యదర్శులు పి.ఎల్. నరసింహారావు, పి.దక్షిణామూర్తి అన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం రెండో రోజు బాలోత్సవంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చిత్రలేఖనం, పోస్టర్ ప్రజంటేషన్‌లో ప్రతిభ కనబర్చారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సమస్యలు పరిష్కరించాలి

తణుకు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులంతా చక్కని మధ్యవర్తిత్వంతో కక్షిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రవినాథ్ తిల్హరి అన్నారు. శనివారం గుంటూరులో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంలో మెలకువలపై సమావేశం నిర్వహించినట్టు సమావేశంలో పాల్గొన్న తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరంపూడి కామేష్, ఈదా రామకృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

నరసాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నరసాపురం, పాలకొల్లు సబ్ ఈఆర్వో కార్యాలయాల్లో ఆదివారం విద్యుత్ బిల్లుల కౌంటర్ల అందుబాటులో ఉంటాయని ఈపీడీసీఎల్ ఈఈ మధుకుమార్ చెప్పారు. వినియోగదారులు బిల్లుల్ని ఆఫీసు సమయాల్లో ఈ కౌంటర్లలో చెల్లించవచ్చునన్నారు.

45 పశువులకు వైద్య పరీక్షలు

నరసాపురం రూరల్, జనవరి 25 (ఆన్ లైన్): మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామంలో శనివారం పశువర్ధక శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ గుబ్బల భానుమూర్తి, ఉప సర్పంచ్ కటకంశెట్టి నర్సింహమూర్తి ప్రారంభించారు. నరసాపురం పశువైద్యాధికారి డాక్టర్ సురేంద్రకుమార్ 45 పశువులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణి చేశారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

పెనుగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం మైక్ ప్రచారం నిర్వహించింది. పెనుగొండ మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం గౌతమ్ అదానితో కుదుర్చుకున్న గ్రీన్ ఎనర్జి ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించి ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల రూపాయలు భారం విధించడం అన్యాయమన్నారు.



జంతు సంక్షేమానికి సహకరించాలి

పెనుగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భావి భారత పౌరులు అయిన విద్యార్థులు ద్వారా జంతు సంక్షేమానికి తోడ్పాటు కల్పించాలి అనే ఉద్దేశంతో జంతు సంక్షేమ పక్షత్సవాలు నిర్వహించడం జరుగుతుందని పెనుగొండ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం. ప్రమీల రాణి అన్నారు. వడలి జడ్పీ హైస్కూలులో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడం అత్యవసర సమయాల్లో వీధి కుక్కలు మిగిలిన జంతువులకు ఆహారం , నీరు మానవతా దృక్పదంతో అందజేయడం ఫల వృక్షాలను నాటడం ద్వారా పక్షి సంతతిని అభివృద్ధి చేయవచ్చన్నారు. కుక్క కాటుకు గురైన వెంటనే తీసుకోవాల్సిన టీకాలపై అవగాహనకల్పించారు.


దేవిడ్ రాజు చిత్రపటం వద్ద తహసీల్దార్ నివాళి

దేవిడ్ రాజు సేవలు మరువలేం

మొగల్తూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోగా దేవిడ్ రాజు సేవలు మరువలేమని తహసీల్దార్ రాజ్ కిశోర్ నివాళులర్పించారు. ఇటీవల విధులు నిర్వహిస్తూ మృతి చెందిన దేవిడ్‌రాజు సంతాప సభలో ఆయన మాట్లాడారు. దేవిడ్‌రాజు చిత్ర పటానికి నరసాపురం, మొగల్తూరు మండలాల తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.




భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పెంటపాడులో సీనియర్ ఓటర్లకు సత్కారం


ఓటు వజ్రాయుధం

●ఓటర్ల దినోత్సవంలో వక్తలు ● సీనియర్ ఓటర్లకు సత్కారం

భీమవరం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, 18 ఏళ్ల నిండిన యువత ఓటరుగా నమోదు కావాలని డీఆర్‌వో మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో 15వ ఓటర్ల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎక్కువసార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను డీఆర్‌ఓ, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నా రాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ అప్పారావు, రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన వ్యాచరచన, వకృత్వం పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. డీఈవో ఇ.నారాయణ, కలెక్టరేట్ ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సన్యాసిరావు తదితరులు పాల్గొ న్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ఓటు హక్కు నమోదు చేసుకోవడమే కాక ఓటును నిర్భయంగా వేయాలని భీమవరం తహసీల్దారు రావి రాంబాబు అన్నారు. భీమవరం రెవెన్యూ శాఖ, చాంబర్ ఆఫ్ కామర్స్, శ్రీ విజ్ఞాన వేదిక, కెజిఆర్ఎల్ బి. ఫార్మసీల ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం ర్యాలీ, మానవ హారం, ప్రతిజ్ఞ, సీనియర్ ఓటర్లు కనుమూరి సత్యనారాయణ రాజు, రంగసాయి, గ్రంధి శ్రీరామమూర్తి, తుమ్మలపల్లి శివను సత్కరించారు.

నరసాపురం రూరల్: ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో దాసిరాజు పిలుపునిచ్చారు. సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. తహసీల్దారు రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: ఓటు హక్కుతో సమర్థ నాయకుల్ని ఎన్నుకోవాలని తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటర్ల దినోత్సవంలో పాల్గొన్నారు. డిటి సుగుణ సంధ్య, ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్ సర్కార్, వీఆర్వోలు, బిఎల్‌వోలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి: ఓటు ప్రజాస్వామ్యానికి తొలిమెట్టు.. అని తహసీల్దారు జి.పవన్‌కుమార్, ఎంపీడీవో ప్రేమాన్విత పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పలువురు సీనియర్ ఓటర్లను సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఆర్డీవో ఖతీఫ్ కౌసర్ బానో, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్, జనసేన పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, నాయకులు పాల్గొన్నారు.

తణుకు: ఎస్కేఎస్డీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు శ్యామలాదేవి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పెంటపాడు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించారు. తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. కిలపర్తి వెంకట్రావు, డీసీ చైర్మన్ బండారు వెంకట్రావు, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, కసిరెడ్డి మధులత ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. మౌంజీపాడులో తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

కాళ్ళ: కాళ్ల హైస్కూల్లో తహసీల్దారు జి.సుందర్ సింగ్ ఓటు విలువను వివరించారు. సీనియర్ ఓటర్లైన వయోవృద్ధులను సత్కరించి, కొత్తగా ఓటుహక్కు పొందిన వారికి కొత్త ఓటు గుర్తింపు కార్డును పంపిణీచేశారు. అనంతరం విద్యార్థుల తో కలిసి ర్యాలీ నిర్వహించారు. వీఆర్వోలు శివనాగరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహసీల్దార్ దశిక వంశీ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసిల్దార్ కోరారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను, వృద్ధులను, దివ్యాంగులను సత్కరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆచంట: ఓటు ఎంతో విలువైనదని తహసీల్దార్ జి. కనకరాజు అన్నారు. ఆచంటలో విద్యార్థులతో మానవహారం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. అలాగే సీనియర్ ఓటర్లను సన్మానించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఎస్ఐ కట్టా వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు టౌన్: పట్టణంలో ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ ఆధర్వర్యంలో సీనియర్ ఓటర్లును సత్కరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో గంగాధర శర్మ, హెచ్ఎం నాని, నాయకులు పాల్గొన్నారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓటు హక్కును బాధ్యతగా వినియోగించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎఎస్ఎస్‌రమణ కుమార్ తెలిపారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిన్సిపాల్ డాక్టర్ టి. రాజరాజేశ్వరి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పాలకొల్లు రూరల్: 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. కాపవరం సచివాలయంలో జరిగిన ఓటర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులను ఆయన సన్మానించారు.

పెనుగొండ: ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ జి. అనిత కుమారి అన్నారు. శనివారం చెరుకువాడ హైస్కూలులో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ శ్యామలా సోని మాట్లాడారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు.

గణపవరం: గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. సీనియర్ ఓటర్లను అభినందించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు పాల్గొన్నారు.

ఉండి: ఓటును విధిగా వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి అరుణ అన్నారు. శనివారం ర్యాలీ నిర్వహించారు.తహసీల్దారు నాగార్జున అధ్యక్షత వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు.

ఆకివీడు: శనివారం రెవెన్యూ, ఎంపీడీవో, నగర పంచాయతీల ఆధ్వర్యంలో ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పించి, ర్యాలీ, మానవహారం నిర్మించారు. ఓటును స్వార్థానికి వినియోగించరాదంటూ తహసీల్దార్ నందారి వెంకటేశ్వరావు ప్రతిజ్ఞ చేయించి సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు, శ్రీకర్, ఫరూక్, ఆంజనేయులు సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

పారిశుధ్య సమస్య రానివ్వద్దు

కాళ్ళ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు తెలిపారు. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. విద్యుత్ ఏఈ రాంబాబు మాట్లాడుతూ ఇళ్లకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, దీన్ని వినియోగించుకోవాలన్నారు. జడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు పద్మారాణి, నాగలక్ష్మి, ఎంపీడీఓ జి.స్వాతి, ఏఈలు పి.రాంబాబు, ఎంఇఓ రవీంద్ర, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి సమాచారమేదీ?

ఇరగవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీవో ఎ. శ్రీనివాసు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ఉందన్న సమాచారం ఇవ్వడంలేదని పలువురు సభ్యులు ఆరోపించారు. దీనికి స్పందించిన ఎంపీడీవో శ్రీనివాసులు మళ్ళీ ఇటు వంటి పొరపాటు జరగదని హామీ ఇచ్చారు. కాకిలేరు గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలో మంచినీటి సౌకర్యం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ జవ్వాది ఫణిబాబు కోరారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నాయకుల నిరసన

సూపర్ సిక్స్ అమలు చెయ్యాలి

భీమవరంటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి పిలుపు మేరకు, శనివారం భీమవరం లోని కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరికుమార్ రాజ్ ఆధ్వర్యంలో తాలి బజావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానం అమలులో, ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఆరోపించారు. భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకర రాజకుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోంబాబు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు..

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం కడియద్ద, మారంపల్లి గ్రామాల్లో శనివారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. సర్పంచ్‌లు యాతం కోటేశ్వరి, సరిపల్లె పద్మ, పశువైద్యులు విజయ్‌కుమాఆర్, సునీల్‌కుమార్, ఉప సర్పంచ్ సరిపల్లె పెద్ద వెంకటరాజు, నాయకుడు యాతం బూరయ్య, కార్యదర్శులు శ్రీనివాస్, అహ్మద్ పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

అత్తిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నేతృత్వంలో ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో బల్లిపాడు గ్రామం దత్తత తీసుకున్న డాక్టర్ దండు పద్మావతి సౌజన్యంతో బల్లిపాడు ఆశ్రమ శాఖలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. మందులు అందజేశారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి

యలమంచిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లు పూర్తిచేసిన ప్రతిరైతూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్.దేవి అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో రైతులకు ఈ పంటనమోదుపై అవగాహన కల్పించారు.


ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ తదితరులు

ప్లాస్టిక్ నిషేధం సాధ్యం : జేసీ

భీమవరంటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధితో ఆచరిస్తే ప్లాస్టిక్ నిషేధం సాధ్యమవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక త్యాగరాజ్ భవన్‌లో భీమవరం పురపాలక సంఘం, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్స్ యజమానులకు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేసీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ భీమవరాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం బదులుగా గాజు, స్టీలు గ్లాసులు వాడాలని నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించడం జరు గు తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గట్టిగా ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై వివరించారు. ప్రతిజ్ఞ చేశారు. కాగా శనివారం సాయంత్రం జేసీ షాపులను ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడుతూ ఇక నుంచి తనిఖీలు ముమ్మరంగా ఉంటాయని, నిషేధిత కవర్లు విక్రయిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట కమిషనర్ కే. రామచంద్ర రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


గాదిరాజు బాబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు

గాదిరాజు బాబుకు పలువురి పరామర్శ

భీమవరం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డీఎన్ఆర్ పాలకవర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తండ్రి సోమరాజు మరణించటంతో శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు పరామర్శించారు. సోమరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. టీచర్స్ ఎమ్మెల్సీ బి. గోపి మూర్తి, డాక్టర్ ఇర్రింకి సూర్యరావు, ఉండి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి పీవీఎల్ నరసింహరాజు బాబును పరామర్శించారు.

క్రమశిక్షణతోనే అభివృద్ధి

అత్తిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రమ శిక్షణ అలవాటు చేసుకుంటే ఉత్తమ పౌరులుగా తయారు కాగలరని అత్తిలి మానవత సంస్థ అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు అన్నారు. కొమ్మర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలు పెంపునకు ఆచరించాల్సిన పద్ధతులపై వివరించారు. కెరీర్ గైడెన్స్ జిల్లా చైర్‌పర్సన్ కోడూరి రాధా పుష్పవతి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ చూడడం మానుకోవాలన్నారు. మానవత అత్తిలి చైర్మన్ ఆనాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. కొమ్మర ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి అందజేసిన పుస్తకాలను బాలకృష్ణంరాజు అందజేశారు.


ఉద్యోగాలకు ఎంపికైన వారితో మంత్రి నిమ్మల

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు : మంత్రి

పాలకొల్లు అర్బన్/టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక ఛాంబర్స్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఛాంబర్స్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఉద్యోగ దిక్సూచి మెగా జాబ్ మేళా ముగింపు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని పలు కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించి అభినందించారు. జాబ్‌మేళాలో 540 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది డీఎస్సీ ద్వారా 16,500 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఆర్డీవో దాసి రాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి. లోక్‌మాన్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి బి. వరలక్ష్మి, తహసీల్దార్ దుర్గా కిషోర్, ఛాంబర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ..

డీఎస్సీకి హాజరయ్యే వారి కోసం తన తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన ధర్మారావు ఫౌండేషన్ ద్వారా సుమారు 700 మందికి శిక్షణ ఇప్పిస్తున్నట్టు మంత్రి విలేకరులకు తెలిపారు. శిక్షణను బీఆర్ఎంవీఎం హైస్కూల్లో ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు ప్రారంభించనున్నట్టు వివరించారు.

ఢిల్లీలో డెలిగేట్స్‌తో పెదతాడేపల్లి సర్పంచ్



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాలు ప్రజలకు చేరవేయడంలో నూరుశాతం పనిచేసిన సందర్భంగా ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం శనివారం కేంద్ర బృందంతో కలసి అభినందన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలో తనతోపాటు తన సతీమణికి సాదర స్వాగతం లభించిందని అక్కడ ఎర్రకోట గణతంత్ర వేడుకలకు ఆహ్వానించడంతో పాటు సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.


గురుస్వామి జగన్ దంపతులకు సత్కారం

కోర్కెలు తీర్చే ఆదిపరాశక్తి

ఆకివీడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కోర్కెలు తీర్చే శక్తిపీఠం ఆది పరాశక్తి అని నగర పంచాయతీ చైర్మన్ జామి హైమవతి అన్నారు. శనివారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద గురుస్వామి జగన్ నేతృత్వంలో పలువురు మాలలు ధరించి పూజలు చేశారు. చెన్నైకు 97 కిలో మీటర్ల దూరంలో మేల్‌మరుత్తూర్‌లో ఆదిపరాశక్తిపీఠం ఉందని, ఐదు రోజులు ఇక్కడ పూజలు చేసి అనంతరం వెళతామన్నారు. గురుస్వామి దంపతులను సన్మానించారు.



సేవా కార్యక్రమాల్లో..

పూర్వ విద్యార్థులు

పాలకొల్లు అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) :స్థానిక బిఆర్ఎంవీఎం హైస్కూల్లో 1981వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గత 22 ఏళ్ళుగా పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆత్మీయ కలయిక వంటి చైతన్య కార్యక్రమాలు చేస్తున్నారు. విద్యా బోధనలు చేసిన గురువులకు సత్కారాలు, ప్రతీ ఏటా జనవరి నెలలో అందరూ కలిసి ఆత్మీయ కలయికగా పలు ప్రాంతాలకు వెళ్ళివస్తూంటారు. అలాగే పాఠశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు స్కాలర్ షిప్పులు ఇవ్వడం, మే నెలలో పాఠశాల వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు వంటివి చేస్తూ సేవలు అందిస్తున్నారు. వలస కార్మికులకు మందులు, నిత్యావసరాలు, దుస్తులు అందిస్తుంటారు. విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందిస్తున్నారు. అలాగే స్కూల్ శిథిలావస్థలో ఉన్న సమయంలో నూతన భవన నిర్మాణాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రకు వెళుతున్నట్టు అధ్యక్ష కార్యదర్శులు వట్టం గణేష్, కెవి సాంబశివరావులు తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

'రొమాంటిక్ లైఫ్' పోస్టర్ ఆవిష్కరణ

భీమవరంటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లి ఫిలిమ్స్ బ్యానర్‌లో నిర్మించిన రొమాంటిక్ లైఫ్ చిత్రం పోస్టర్లను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్ర నిర్మాత పెన్మెత్స సత్యనారాయణ రాజు, వీరవల్లి ఉమామహేశ్వరరావు గతంలో అనేక చిత్రాలు నిర్మించారని అవన్నీ సఫలీకృతమయ్యాయని, ఈ రొమాంటిక్ లైఫ్ చలన చిత్రం కూడా తప్పక విజయం సాధిస్తుందన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ ఈ చిత్రం ఉమ్మడి కుటుంబ కథాంశమని, అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 31న ఈ చిత్రం విడుదల అవుతుందని, చిత్రానికి మహేష్ భాగ్యరాజ్ దర్శకుడని, హీరో హీరోయిన్లుగా ప్రశాంత్, అంజని నటిస్తున్నారన్నారు.


బంగారు హారాన్ని అందజేస్తున్న దాతలు

మావుళ్లమ్మకు 9 కాసుల నగ బహూకరణ

భీమవరం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మకు తంజావూర్‌కు చెందిన మేజర్ ఎస్. అరుణ్ దంపతులు 72 గ్రాముల బంగారు నగను అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా దేవస్థానం ఈవో బుద్ధ మహలక్ష్మి నగేష్‌కు నగను అందజేయగా పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కుంచనపల్లిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి రఘురాం నాయుడు రూ.2 లక్షల విరాళం అందించారు. కుంచనపల్లి స్వామివారి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయం వద్ద ప్లంబింగ్, ఎల్కక్రికల్ పనుల నిమిత్తం ఈ విరాళం అందించారు. నాయకులు గొర్రెల శ్రీను, మాకరాజు సతీష్, ఆలయ కమిటీ చైర్మన్ దాసరి మల్లికార్జునరావు, అధ్యక్షులు ఎ. పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ ప్రకాశరావు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తణుకు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని తణుకు మాంటిస్సోరి స్కూల్ డైరెక్టరు అనపర్తి ప్రకాశరావు అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలో ప్రతి శనివారం నిర్వహించే వివిధ సాంస్కృతిక, భాషా పోటీలలో విశేష ప్రతిభ కనబర్చిన విజేతలుకు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. 1500 మంది విద్యార్థులకు బహుమతులు అందించినట్లు చెప్పారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

భీమవరం అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసరాల ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్‌పార్టీ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణ ముర్తి డిమాండ్ చేశారు. ఉల్లి, వెల్లుల్లి, పప్పుదినుసులు వంటనూనెల ధరలు రెండు రేట్లు పెరిగాయన్నారు.

సెలబ్రిటీ


సంక్రాంతికి వస్తున్నాం వర్కింగ్ స్టిల్

సంక్రాంతి స్టార్ బుల్లి రాజు

ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క ఛాన్స్ నేనేంటో చూపిస్తా.. అంటూ సినీ పరిశ్రమలో అడుగుపెట్టి మొదటి సినిమాతోనే అంతా తన వైపు చూసేలా చేసుకొన్న చిచ్చర పిడుగు బుల్లిరాజు మన గోదారి కుర్రోడే. కొల్లేరుతీర ప్రాంతం ఛానమిల్లి నుంచి తన రీల్స్‌తో అందరినీ ఆకట్టుకొన్న బుల్లిరాజు సినిమా ఛాన్స్ కొట్టేశాడు. గోదావరి యాస, ప్రాసతో అందరిని ఆకట్టుకున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో బుల్లిరాజు నటనకు ప్రేక్షకులతో పాటు సినీ హీరోలు సైతం ఫిదా అయిపోయారు. వెంకటేష్, మహేష్‌బాబు, నాగార్జున, చిరంజీవి వంటి స్టార్ హీరోలతో పాటు సినీ పెద్దలతో శభాష్ అనిపించుకొన్న బుల్లిరాజుతో కాసేపు ముచ్చటిద్దాం..



❖ **మొదటి చిత్రంతోనే స్టార్ అయ్యావ్.. ఎలా ఫీల్ అవుతున్నావ్..?**

చాలా సంతోషంగా ఉంది. సినిమా చూసిన వారంతా నా పాత్రను బాగా ఆనందించారు. నన్ను బాగా రిసీవ్ చేసుకుంటున్నారు.

❖ **బుల్లిరాజుగా ఫేమస్ అయ్యావ్.. అసలు పేరు ఏమిటి ?**

సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బుల్లిరాజుగా గుర్తింపు పొందడం అనిల్ సార్ వల్లే జరిగింది. రేవంత్‌ను బుల్లిరాజుగా పరిచయం చేసిన ఘనత ఆయనదే. నా పూర్తి పేరు భీమాల రేవంత్ పవన్ సాయి సుభాష్. మా నాన్న భీమాల శ్రీనివాసరావు, అమ్మ దేవి, మా తాతయ్య సుబ్బారావు, నాగమణి నన్ను ఎంతో గారాబంగా చూసుకుంటారు.

❖ **సినిమాలో ఛాన్స్ ఎలా వచ్చింది?**

నాకు పవన్‌కల్యాణ్ అంటే చాలా ఇష్టం. మొన్న ఎన్నికల్లో జనసేన తరుఫున ఇంటింటీ వెళ్లి ప్రచారం కూడా చేశారు. మా నాన్న స్నేహితుడు గోలి సాయి ప్రచారాన్ని రీల్‌గా చేసి ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. రెండు గంటల్లో 4లక్షల మంది చూడడంతో పాపులర్ అయ్యింది. దర్శకుడు అనిల్ సార్ క్లోజ్ ఫ్రెండ్ గుడివాడకు చెందిన సాయికృష్ణ అంకుల్ ఆ రీల్ చూసి అనిల్ సార్‌కు చెప్పారు. నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. మొత్తం 20 మందిని పిలవగా నేను ఎంపికయ్యాను.


అమ్మా నాన్నతో బుల్లిరాజు

భీమవరంలో నేడు సక్సెస్ మీట్

సంక్రాంతికి వస్తున్నాం సినిమా సక్సెస్ మీట్ ఆదివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. దర్శకుడు అనిల్ రావిలపూడి, హీరో వెంకటేష్, హీరోయిన్లు, మిగతా నటులతో బుల్లిరాజు కూడా సందడి చేయనున్నాడు.

❖ **సినిమాలో నటనపై అమ్మా నాన్న ఏమంటున్నారు?**

నేను సినిమాలో నటించడానికి అమ్మా నాన్న ప్రోత్సహమే మూలం. వాళ్ల నన్ను ఎంకరేజ్ చేశారు. సినిమా షూటింగ్ కోసం మా నాన్న సుమారు 90 రోజుల పాటు నాతోనే ఉన్నారు. సీనియర్ నన్ను పరిచయం చేసేవారు.

❖ **ఏం చదువుతున్నావ్? స్కూల్‌లో బుల్లిరాజు లాంటి పిల్లాడివా?**

నేను బావాయిపాలెం ప్రైవేటు స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాను. స్కూల్‌లో ఎక్కువగా మా ఫ్రెండ్స్‌తో సరదాగా ఉంటాను. ఈ మేనరిజమ్ నాకు సినిమా నటనకు ఎంతో ఉపయోగపడింది. స్కూల్‌లో ఎప్పుడూ గుడ్ బాయ్ నే. కబడ్డీ, కోకో ఆటలు బాగా ఆడేవాడిని. నా పుట్టినరోజు జూలై 7.

❖ **సినిమాలో బాగా నటించావు.. నటనలో శిక్షణ తీసుకున్నావా..?**

నటనలో శిక్షణ తీసుకోలేదు. దర్శకుడు అనిల్ సార్ చెప్పినట్టు చేసేవాడిని. నటనలో మెళకువలు ఆయనే నేర్పించారు. నాకు డాన్స్ డ్రాయింగ్ అంటే చాలా ఇష్టం.

❖ **సినిమాల ధ్యాసలో పడి చదువు..?**

గత ఆగస్టు నుంచి స్కూల్‌కు వెళ్లలేదు. నిన్ననే స్కూల్‌కు వెళ్లాను. చదువులో ముందుంటాను. ఫ్రెండ్స్ రేవంత్ అని పిలి చేవారు. ఇప్పుడేమో బుల్లిరాజు అంటున్నారు. ఈ ఫీలింగ్ గొప్పగా హ్యాపీగా ఉంది.

❖ **ఇంకా సినిమాల్లో ఛాన్స్ వస్తే..?**

సంక్రాంతి సినిమా తర్వాత 15 వెబ్ సిరీస్, 4 సినిమాలలో అవకాశాలు వచ్చాయి. చదువుకు ఆటంకం కాకూడదని మా మమ్మీ, డాడీ నిర్ణయం. అనిల్ సార్ నా గాడ్‌ఫాదర్. ఆయనే నాకు యాక్టర్‌గా లైఫ్ ఇచ్చారు. ఆయన మూవీలకే నా తొలి ప్రాధాన్యం.

❖ **పెద్ద హీరోలను కలిశావా..?**

సీనియర్ నటులు విక్టరీ వెంకటేష్ సార్‌తో 62 రోజుల షూటింగ్ చాలా సరదాగా సాగింది. సెట్‌లో అందరూ నన్ను ఎంకరేజ్ చేసేవారు. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకొన్నాను.

❖ **ఎలాంటి సినిమాలంటే ఇష్టం..?**

మా మావయ్య మోహన్ రాజేష్‌తో కలసి ఎక్కువగా సినిమాలకు వెళుతుంటాను. ప్రతి శనివారం ఆయనే నన్ను సినిమాలకు తీసుకువెళ్లేండేవారు. మా డాడీతో కూడా వెళతా. కామెడీ మూవీస్ అంటే చాలా ఇష్టం,

❖ **తొలి సినిమా అనుభవం ఎలా ఉంది?**

అనిల్ సార్ దర్శకత్వంలో సినిమా అనగానే ఎగిరి గంతేశాను. కానీ తర్వాత విక్టరీ వెంకటేష్ గారు హీరో అని తెలియగానే తొలుత గాబరా పడ్డాను. కానీ షూటింగ్‌లో వెంకటేష్ గారు నన్ను దగ్గరకు తీసుకొని ఎలా నటించాలో చక్కగా వివరించేవారు. సినిమా షూటింగ్ కేరళ, తమిళనాడు. అరకు, హైదరాబాదులో చిత్రీకరించారు. సాంగ్ మాత్రం ఉత్తరప్రదేశ్‌లో షూట్ చేశారు. సుమారు 62 రోజులు పాటు ఈ షూటింగ్‌లో పాల్గొన్నాను.

❖ **నటనతో పాటు ఇంకా ఏమేమి ఇష్టం..?**

నాకు డ్రాయింగ్, డాన్స్ అంటే చాలా ఇష్టం. ఐ యామ్ ఎ పెట్ లవర్. పక్షులంటే చాలా ఇష్టం, నా ఫేవరెట్ బర్డ్ సన్‌ఫ్లవర్ కన్యూర్. ఫిషెస్ పెంచడమంటే కూడా ఇష్టమే.

❖ **రీసెంట్‌గా చూసిన సినిమా?**

సంక్రాంతికి వస్తున్నా సినిమా నేను నటించిన చిత్రం. దీనికి ముందు చూసిన చిత్రాలంటే లక్కీభాస్కర్, అమరన్. మట్కా, చాలా సినిమాలు చూశాను.

❖ **ఫ్యూచర్ ప్లాన్ సినిమాలా.. చదువా?**

భవిష్యత్‌లో డాక్టర్ కావాలన్నదే నా కోరిక. అనుకోకుండా నటుడిని అయ్యాను. కానీ డాక్టర్ అంటేనే నాకు ఇష్టం.


హీరో, హీరోయిన్లు చాలామంది ముందు డాక్టర్లు అయ్యాక యాక్టర్లు అయ్యారు. రాజశేఖర్, శ్రీలీల ఇలా. మన బుల్లిరాజు ముందే యాక్టర్.. తర్వాత డాక్టర్ కావాలని కోరుకొంటున్నాడు. ఆల్ ది బెస్ట్ బుల్లిరాజు..

\- నిడమర్రు, ఆంధ్రజ్యోతి



సండే స్పెషల్

ఉసురు తీస్తున్న ఒత్తిడి



నీళ్ల గ్లాసులో పడిన అల్పప్రాణి చీమ సైతం ఆఖరి క్షణం వరకూ ప్రాణం కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతుంటే అవగాహన లేమి, క్షణికావేశంలో యువత, బాలల బలవన్మరణాలు ఆందోళన కలిగిస్తోంది. భూమిపై మానవులు తప్ప ఏ ఇతర ప్రాణి క్షణికావేశంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. మేధస్సు కల్గిన మనిషికి ఎందుకు ఇంత బలహీనత.. విద్యార్థి దశ నుంచే బలవర్మణాలకు పాల్పడుతున్న పరిస్థితులపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ఆదివారం ప్రత్యేక కథనం.

\- పాలకొల్లు, ఆంధ్రజ్యోతి

- » పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో డిప్రెషన్
- » మార్కులు, ర్యాంకుల భయం
- » తల్లిదండ్రులకు భయపడి పిల్లల బలవన్మరణాలు

పిల్లలకు ఉన్నతమైన జీవితం అందించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటూనే ఆప్యాయతను సైతం పక్కన పెట్టి కేజీ నుంచి పీజీ వరకు హాస్టళ్లలో బందీలుగా చేస్తున్నారు. మానసిక పరిపక్వత లేని దశలో పిల్లలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. చదువు సరిగ్గా అబ్బడం లేదనో.. అనుకున్న లక్ష్యం చేరుకోలేమని తల్లిదండ్రులు నుంచి మాట పడాల్సి వస్తుందన్న భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకోవడం కలకలం రేపింది. నిడదవోలు గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి తీవ్ర మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడడం ఎందరినో కలచి వేసింది.

అమ్మా నాన్నల అంచనాలు..

ఇటీవల పలువురు విద్యార్థుల ఆలోచనా సరళి మారుతుంది. అమ్మానాన్నల అంచనాలు అందుకోలేకపోతున్నామనీ, తనను అర్థం చేసుకునే వాళ్ల లేరని, కావాలసినంత ప్రేమ, అప్యాయతలు దొరకడం లేదని హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు తమ భావాలను వ్యతిరేక దృష్టితో ఆలోచిస్తూ కుంగిపోతున్నారు. ఇవి తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

గంటకు ఒకరి ఆత్మహత్య..!

జాతీయ క్రైం బ్యూరో రికార్డుల ప్రకారం దేశంలో గంటకు ఒకరు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. వివిధ కారణాలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై డిప్రెషన్‌లోకి వెళ్లిన విద్యార్థులు ఇలా ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

ప్రతి పది మందిలో నలుగురు..

ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రతీ పది మంది విద్యార్థులలో నలుగురు తీవ్ర ఒత్తిడి, కుంగుబాటు కారణంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నారని సెంట్రల్ ఫర్ స్టడీ, డెవలప్ మెంట్ సొసైటీ సర్వేలో తేలింది. ఇటీవల ప్రధాని మోదీ తన ప్రసంగంలో యువత నిరాశను అణిచి పెట్టుకోవడం మాని బయటకు చెప్పుకోవ డమే సరైన పద్ధతి అని పిలుపునివ్వడం గమనార్హం.

ప్రాణం తీస్తున్న పోటీ..

నేటి విద్యా విధానం ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో విపరీతమైన పోటీతత్వాన్ని విద్యార్థులలో కలగచేయడంతో ఒత్తిడి తట్టుకోలేని విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఒక సామాజిక సర్వేలో తేలింది. విచిత్రం ఏమిటంటే ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న తెలివైన విద్యార్థుల్లో పలువురు బలవన్మరణాలకు గురవుతున్నారు.

ఆధిపత్య ధోరణి..

ఇటీవల పలు విద్యాసంస్థలు ర్యాంకుల ఆధిపత్య పోరులో అనారోగ్య వాతావరణాన్ని కల్పిస్తున్నాయని మేధావి వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇటువంటి పోకడలపై ప్రభుత్వం దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఒత్తిడిని ఎదుర్కోవడం ఇలా..

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలి. ముభావంగా ఉండే పిల్లలను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలి. స్నేహితులు కుటుంబ సభ్యులు ఇటువంటి విద్యార్థులతో సన్నిహితంగా మెలగాలి. అవసరం మేరకు మానసికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

కౌన్సెలింగ్ ఇవ్వాలి

డిప్రెషన్‌లో ఉన్న విద్యార్థులలో మార్పు ఒక్కసారిగా సాధ్యం కాదని, విద్యార్థులు చెప్పే కారణాల ఆధారంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ఉపయోగకరమని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. అవసరమైన సహాయ కేంద్రాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

విద్యార్థులకు మానసిక, భౌతిక అవసరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ర్యాంకులతో పాటు మానసిక, వ్యాయామ, విద్యనందించాలి. అప్పుడే విద్యార్థుల్లో బలవన్మరణాలు తగ్గుతాయని పరిశీలకులు సూచిస్తున్నారు.

బాల్యం నుంచే విద్యార్థులలో కొంత ఒత్తిడి ఉంటుందని మానసిక శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు స్థాయికి మించడంతో తెలిసీతెలియని వయసులో బలవన్మరణాలకు కారణమవుతోంది. ఐఐటీ సీటు కోసం 6వ తరగతి నుంచే ఒత్తిడి పెంచుతున్నారు.

ప్రపంచ వ్యాప్తం గా 10 - 19 ఏళ్ల వయస్సున్న ప్రతీ ఏడుగురిలో ఒకరు మానసిక సమస్యతో బాధపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 15 - 29 వయస్సు వారిలో మరణానికి కారణం ఆత్మహత్యలే కావడం ఆందోళన కలిగిస్తోంది.

క్రైం రికార్డు బ్యూరో అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో 33 శాతం ఆత్మహత్యలు పెరిగాయి. 2017 లో దేశవ్యాప్తంగా 995మంది ఆత్మహత్య చేసుకోగా 2020లో 12526, 2021లో 13,089కి చేరాయి. గత ఏడాది 56529 మంది యువత ఆత్మహత్యకు పాల్పడ్డారు.

డిప్రెషన్‌లో ఇలా..

పాఠశాల స్థాయి నుంచి తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులు ఇంటి నుంచి పారిపోవడం, ముభావంగా ఉండడం, నలుగురితో కలవకపోవడం గమనించవచ్చని మానసిక వైద్యులు చెబుతన్నారు. ఇంట్లో వాళ్లే కాకుండా స్నేహితులు సైతం తనను తక్కువగా చూస్తున్నారనే భావనలో ఉంటారు. ఇలా డిప్రెషన్ నుంచి బయట పడకపోతే ఆత్మహత్యే శరణ్యమనే భావనకు వెళతారని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు.

యువతుల్లో ఆరోగ్య సమస్యలు

ఇటీవల తెలుగు రాష్ట్రాలలోని పలు కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థినుల హాస్టళ్లను అధికారులు తనిఖీ చేసినప్పుడు అనేక దారుణాలు వెలుగు చూశాయి. అపరిశుభ్ర వాతావరణం, టాయిలెట్ నిర్వహణలో వైఫల్యం, చివరకు ఆడపిల్లలు వినియోగించే శానిటరీ నేప్‌కిన్‌లు సైతం అందుబాటులో ఉంచకపోవడం, కళాశాలల్లో చదివే యువతలో యూరిన్ సంబంధ ఆరోగ్య సమస్యలు గుర్తించడం ఆందోళన కలిగించాయి

8 శాతం విద్యార్థులే..

దేశంలో వెలుగు చూస్తున్న ఆత్మహత్యలలో 8శాతం మంది విద్యార్థులే ఉంటున్నారనీ వివిధ గణాంకాలు సూచిస్తున్నాయి. మొత్తంగా ప్రైమరీ స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకూ కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులలోనే అధిక శాతం బలవన్మరణాలు వెలుగు చూస్తున్నాయని వివిధ నివేదికలు తెలుపుతున్నాయి.

ప్రధాన కారణాలు ఇవే..

విద్యార్థులలో అస్థిర ఆలోచనలు డిప్రెషన్ కలిగిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు..

- అస్థిర ఆలోచనలు.
- సరైన సంబంధాలు లేకపోవడం.
- సరిగ్గా చదువుకోక పోవడం.
- ఎంత చదివినా గుర్తుండక పోవడం.
- మార్కుల శాతం తగ్గడం.
- ఉద్యోగం వస్తాందో లేదో అపనమ్మకం.



భీమవరంలో రిపబ్లిక్ డే వేడుకలకు సిద్ధమైన సభా ప్రాంగణం, ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ముస్తాబైన వేదిక

గణతంత్ర వేడుకలకు వేదికల ముస్తాబు

ఏలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రగతి శకటాల ప్రదర్శన నిర్వహిస్తారు. అనంతరం 11 గంటలకు ఉత్తమ అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను బహుకరిస్తారు.

● భీమవరం టౌన్: కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర వేడుక ఏర్పాట్లను శనివారం సాయంత్రం జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు పరిశీలించారు. వేదికలు, గ్యాలరీ, 14 స్టాల్స్, వివిధ శాఖల ప్రగతి శకటాలను ఏర్పాటు చేశామన్నారు. వేడుకలను ఎక్కువ మంది ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


235 అడుగుల జాతీయ పతాక స్తూపం

జాతీయ పతాక స్తూపం

పెదవేగి, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా భారీ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేశామని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్ తెలిపారు. భోగాపురంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన 235 అడుగుల జాతీయ పతాక స్తూపం దగ్గర 2016 ఆగస్టు 15న తొలిసారి జాతీయ పతాకాన్ని ఎగురవేశామని ఆయన చెప్పారు. గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవం జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నామని తెలిపారు.



ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకల రిహార్సల్ పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

గణతంత్ర వేడుకల రిహార్సల్

ఏలూరు క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలకు ముందుగా శనివారం రిహార్సల్ నిర్వహించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ స్వయంగా రిహార్సల్స్ పరిశీలించారు. పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్, ఎన్‌సీసీ క్యాడెట్స్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎస్పీ వీఐపీ హోదాలో కార్యక్రమానికి హాజరై జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పోలీస్ పరేడ్‌ను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ జనవరి 26న ఉదయం ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హాజరై జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖలు రూపొందించిన శకటాలు ఒకదాని వెనుక ఒకటి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎటువంటి అసౌకర్యం లేకుండా కూర్చోడానికి సదుపాయాలు ఏర్పాటు చేయాలని, మంచినీళ్ల ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం విద్యార్థులకు తగిన ఏర్పాట్లు ఇతర అధికారుల సమన్వయంతో చేయాలన్నారు. ఈ రిహార్సల్స్‌లో ఎస్పీతో పాటు ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ చుట్టూ ప్రత్యేక పోలీసు బలగాలతో గస్తీ ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని డిటెక్టర్లతో పరిశీలించేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు పోలీసు జాగిలాలతో వీఐపీలు వచ్చే మార్గాలు, పరేడ్ గ్రౌండ్, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందస్తుగా అన్ని చర్యలను చేపట్టారు.


జెండాలు సిద్ధం చేయిస్తున్న సుభాని

కీర్తి పతాకం

జాతీయ జెండాలు తయారుచేసి ఉచితంగా పంపిణీ చేస్తున్న టైలర్

ఏలూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పాలన్న ఆలోచనతో జాతీయ జెండాలను కుట్టి ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యా సంస్థలకు ఉచితంగా అందజేస్తున్నాడు ఓ సామాన్య టైలర్. ఏటా జనవరి 26, ఆగస్టు 15న జాతీయ జెండాలను పంచి ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తి నింపుతున్నారు. బాపులపాడు మండలం మల్లపల్లి గ్రామానికి చెందిన సుభానీ ఏలూరులో కుట్టుశిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు వేలాది జెండాలు విద్యార్థులు, విద్యాసంస్థలకు అందించారు. పింగళి జీవితంపై పాటలు రాయించి ప్రచారోద్యమాన్ని చేపడుతున్నారు. ఘంటసాల స్వరపరిచి ఆలపించిన దేశభక్తి గీతాలతో పాటల కచేరీలు కూడా నిర్వహిస్తున్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా సుమారు రూ.60 వేల ఖర్చుతో 5వేల జాతీయ పతాకాలను మూడు సైజుల్లో రూపొందించి పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచితంగా పంపిణీ చేశారు. కొన్నేళ్ల క్రితం జాతీయ పతాకం కొందామని దుకాణానికి వెళితే చిన్నజెండా రూ.100, పెద్దసైజు రూ.200 చెప్పడంతో జెండా ఇంత వెచ్చించి కొనలేని వారి పరిస్థితి ఏమిటని ఆలోచించి తానే జెండాలు తయారుచేసి ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నానని సుభానీ తెలిపారు. ఓ పాఠశాలలో పింగళి గురించి విద్యార్థులు చెప్పలేకపోయారు. భావి తరాలకు ఆయన చరిత్రను చెప్పడం కోసం పింగళి చెక్కిన శిల్పం పేరిట జాతీయ పతాక విశిష్టతను వివరిస్తూ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. జెండా రూపశిల్పి పింగళి వెంకయ్యకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని సుభాని కోరుతున్నారు.

దోమల పొగమంటే కాల్చేసింది

పిట్టలోళ్ల గుడిసెలు దగ్ధం
ఆస్పత్రిలో ఆరుగురు

మండవల్లి జనవరి 25(ఆంధ్రజ్యోతి): భైరవపట్నం పరిధిలోని ప్రత్తిపాడు స్టేజీ వద్ద సుమారు 25 కుటుంబాలకు చెందిన పిట్టలోళ్ల గుడిసెలు శుక్రవారం రాత్రి క్షణాల్లో దగ్ధమయ్యాయి. నెల్లూరు, చెన్నై ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి చేపల చెరువులపై పిట్టలు వాలకుండా కాపలా కాసి పొట్టపోసుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లో గాఢనిద్రలో మునిగిన సమయంలో దోమల నివారణ కోసం వెలిగించిన పొగమంట బట్టలకు అంటుకుని గ్యాస్ బండ పేలింది. పిట్టలను బెదిరించేందుకు తుపాకీలలో వాడే మందు కూడా ఉండడంతో పేలుడుతో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో బయటకు పరుగులు తీశారు. పది మంది గాయపడగా ఇద్దరు చిన్నారులతో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, మరో నలుగురు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం సందర్శించి బాధిత కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందించారు.


కాలి బూడిదైన సామగ్రి

ద్వారకాతిరుమల మద్యం షాపులో చోరీ

ద్వారకాతిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులో గుర్తుతెలియని వ్యక్తులు రూ.లక్ష నగదు, మూడు మద్యం సీసాలు అపహరించారు. ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాల ప్రకానం శుక్రవారం అర్థరాత్రి రెండు గంటల సమయంలో దుకాణం షెడ్‌పై రేకులను తొలగించి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. కౌంటర్లో రూ.లక్ష నగదు, 3 మద్యం బాటిళ్లను దొంగిలించారు. శనివారం ఉదయం దుకాణం తెరిచిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరా దృశ్యాలు పోలీసులు పరిశీలిస్తున్నారు.